క్లుప్తంగా

ఎంఈఓగా అదామ్ బాషా



సి.బెళగల్: మండల రెండవ ఎంఈఓ అదామ్ బాషా నియామకం అయ్యారు. ఆదామ్‌బాషాను మండలానికి నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయని ఎంఈఓ జ్యోతి తెలిపారు. ఆదామ్‌బాషా బనగానపల్లె మండలం ఇల్లూరు కొత్తపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి మారందొడ్డి గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రెగ్యులర్ హెచ్‌ఎంగా గతవారం బాధ్యతలు స్వీకరించారు. వారం రోజులకే రెండవ ఎంఈఓగా ఎంపికవడంపై ఉపాధ్యాయులు శుభాకాంక్షలు తెలిపారు. ఆయన సోమవారం బాధ్యతలు స్వీరించనున్నట్లు జ్యోతి తెలిపారు.

20 నుంచి గడప గడపకు మన ప్రభుత్వం

కర్నూలు (న్యూటౌన్): కర్నూలు మండలం జి శింగవరంలో ఈ నెల 20, 21వ తేదీల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ కేపీ అజాంఖాన్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ హాజరవుతారన్నారు. మండల పరిధిలోని అన్ని శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తప్పకుండా హాజరు కావాలని సూచించారు.

అనుమతులు లేకుండా మట్టి తరలిస్తే చర్యలు



చెరువును పరిశీలిస్తున్న ఏఈ అర్జున్‌సింగ్

పాణ్యం: అనుమతులు లేకుండా చెరువుల్లో మట్టి తరలిస్తే చర్యలు తప్పవని మైనర్ ఇరిగేషన్ ఏఈ అర్జున్‌సింగ్ హెచ్చరించారు. పాణ్యం శివారుసున్న చెరువును ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో చెరువు పటిష్టత గురించి పరిశీలించినట్లు తెలిపారు. ముఖ్యంగా చెరువు బండ్, అలుగు, నీటి నిల్వ సామర్థ్యం, చెరువు పరిసరాలను పరిశీలించామన్నారు. రైతులు, గ్రామ పెద్దల సూచనల మేరకు చెరువును పరిశీలించిన తర్వాత సమస్యలను గుర్తించి ఉన్నతాధికారులకు ప్రతిపాదిస్తున్నట్లు పేర్కొన్నారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి

గూడూరు రూరల్: ప్రతిఒక్కరూ రోడ్డు నిబంధనలు పాటించాలని ఎస్‌ఐ సోమ్లానాయక్ సూచించారు. కె.నాగలాపురంలో ఆదివారం వాహనచోదకులకు హెల్మెట్ ప్రయోజనాలపై అవగాహన కల్పించారు.ఆయన మాట్లాడుతూ రోడ్డు నిబంధనలు పాటించనందునే ప్రమాదాలు జరుగుతున్నా యని అసంతృప్తి వ్యక్తం చేశారు. మద్యం సేవించడం, అతివేగం కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ప్రతి వాహనదారుడు రోడ్డుపై ప్రయాణించే సమయంలో తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. హెల్మెట్ రక్షణ కవచమని, ఏదైనా ప్రమాదం జరిగినా ప్రాణాలతో బయటపడుతారని చెప్పారు.

డీజిల్ చోరీ

పాణ్యం: మండల కేంద్రం పాణ్యంలోని జాతీయ రహదారిపై గోరుకల్లు తాండా సమీపంలో ఆగి ఉన్న లారీలో డీజిల్ చోరీ జరిగింది. ఆదివారం తెల్లవారుజామున డ్రైవర్లు నిద్రపోతుండగా దొంగలు 200లీటర్లకు పైగా దొంగిలించినట్లు డ్రైవర్ కర్పానాస్ తెలిపారు. తమిళనాడుకు చెందిన టీఎన్ 81 5667నంబర్ గల లారీ మిషనరీ లోడ్‌తో హైదరాబాద్‌కు వెళ్తుంది. శనివారం రాత్రి భోజనం చేసి హైవే పక్కన లారీని ఉంచి పడుకున్నారు. ఇదే అదునుగ ఆచూసుకున్న దొంగలు డీజిల్ ట్యాంక్‌ను ఒపెన్ చేసి ఖాళీ చేశారు.

గృహ లబ్ధిదారులకు రూ.20వేలు మంజూరు

కోడుమూరు రూరల్ : మండలంలోని జగనన్న కాలనీల్లో గృహాలు మంజూరై ఇప్పటికీ నిర్మించుకోని లబ్ధిదారులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.20వేలను అడ్వాన్స్‌గా చెల్లిస్తున్నట్లు ఎంపీడీఓ చంద్రోశేఖర్ ఆదివారం తెలిపారు. లబ్ధిదారులు నిర్మించుకునేందుకునే ఆసక్తి ఉంటే హౌసింగ్, ఆయా గ్రామ సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లను సంప్రదిస్తే రూ.20వేలను చెల్లించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటారన్నారు. తద్వారా లబ్ధిదారులు ఇంటి నిర్మాణం ప్రారంభించుకునేందుకు బాగుంటుందని, సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ సూచించారు.

27 నుంచి విద్య, వైజ్ఞానిక, సాంస్కృతిక సమ్మేళనం

కర్నూలు (రూరల్): గుంటూరు నగరంలో ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 27 నుంచి 30 వరకు రాష్ట్ర స్థాయి యువజన, విద్య, వైజ్ఞానిక సాంస్కృతిక సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం నగరంలోని సీఆర్ భవనంలో సమ్మేళనానికి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లడుతూ... యువత ఉపాధి అవకాశాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవడం లేదన్నారు. మూడు రోజుల పాటు జరిగే ఈ సదస్సులో జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో యువకులు పాల్గొన్నాలని కోరారు.

తల్లీబిడ్డల ఆరోగ్యానికి రక్ష .. కిల్కారీ!

- వాయిస్ కాల్‌తో ఆరోగ్య సూచనలు, సలహాలు
- గర్భిణులు, బాలింతల సందేహాలు తీర్చనున్న వైనం
- ఇప్పటికే కిల్కారీ సేవలపై ఆశాలకు, అంగన్‌వాడీలకు శిక్షణ

గడివేముల: మాతా శిశు మరణాల నివారణే లక్ష్యంగా రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వినూత్న కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. గర్భిణులు, బాలింతలు, శిశువుల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఆహార నియమాలు, వైద్య పరీక్షలు తదితర అంశాలపై అప్రమత్తం చేసేందుకు కిల్కారీ పేరిట వాయిస్ కాల్స్ అందించేందుకు ప్రభుత్వం రూపకల్పన చేసింది. ప్రతి వారం గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వాయిస్ కాల్ వస్తుంది. ఈ వాయిస్ కాల్ నిమిషం 30 సెకెండ్ల పాటు ప్రతి గర్భిణి వినేలా కిల్కారీ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చారు.

సందేహాలు నివృత్తి

మహిళ గర్భిణిగా ఉన్నప్పుడు స్థానికంగా ఉండే ఏఎన్ఎం దగ్గర గర్భస్థ వివరాలను నమోదు చేసేటప్పుడు ఫోన్ నంబరును నమోదు చేస్తారు. ఆ నంబరుకు కిల్కారీ వాయిస్ కాల్స్ వస్తాయి. గర్భిణులకు ఎదురయ్యే సందేహాలను నివృత్తి చేసే విధంగా ఈ వాయిస్ కాల్ సందేశం ఉంటుంది. మహిళ గర్భం దాల్చిన నాలుగో నెల నుంచి పాలిచ్చే తల్లుల వరకు, అలాగే బిడ్డకు ఏడాది వయసు వచ్చే వరకు 72 సార్లు వాయిస్ కాల్స్, సందేశాలు వస్తాయి.

01244588000 నుంచి వాయిస్ కాల్స్

గర్భిణులు, పాలిచ్చే తల్లుల మొబైలుకు ఆరోగ్యపరమైన సూచనలు, తీసుకోవాల్సిన పోషకాహారం, చేయించుకోవాల్సిన వైద్య పరీక్షలు వంటి అంశాలను వివరిస్తారు. 01244588000 నుంచి వాయిస్ కాల్ సుమారు నిమిషం 30 సెకెండ్ల పాటు ఉంటుంది. గర్భిణులు బిజీగా ఉండి ఫోన్ లిఫ్ట్ చేయని పరిస్థితిలో ఐవీఆర్ సిస్టమ్ ఆటోమెటిక్‌గా ఒకేరోజు మూడుసార్లు ఫోన్ కాల్స్ వచ్చేలా చేస్తుంది. మరలా సంబంధిత సందే శాలను వినాలని అనుకుంటే 14423 టోల్ ఫ్రీ నంబరుకు డయల్ చేసి వినే సౌకర్యం కూడా కిల్కారీ ద్వారా కల్పించారు



వైద్య సిబ్బందికి కిల్కారీపై అవగాహన కల్పిస్తున్న వైద్యురాలు (ఫైల్)

అధికారులు.

ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలకు ప్రత్యేక శిక్షణ

కిల్కారీ సేవలకు సంబంధించి పీహెచ్‌సీలలో ఇప్పటికే ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పిస్తున్నారు. ప్రతి నెలా మొదటివారం జరిగే ఆశ కార్యకర్తలకు ఈ సేవలకు సంబంధించి వైద్యాధికారులు పదే పదే అవగాహన కల్పిస్తున్నారు. ప్రతి అంగన్వాడీ సెంటర్లో ఏర్పాటు చేస్తున్న వైఎస్సార్ సంపూర్ణ పోషణ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన భోజన సదుపాయం, పోషక విలువలు కలిగిన ఆహారం పొందేందుకు వచ్చే గర్భిణులకు కిల్కారీ సేవలకు సంబంధించిన వీడియో చూపించేలా చర్యలు తీసుకున్నారు. తల్లీబిడ్డ ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, కిల్కారీ వాయిస్ కాల్స్ తప్పక వినడం ద్వారా కలిగే ప్రయోజనాలను తెలియచేసేలా కార్యక్రమం రూపొందించారు.

ఎంతో ఉపయోగపడుతుంది



ప్రభుత్వం కిల్కారీ సేవల వలన ఎంతో అవగాహన కలిగింది. మనకు గుర్తులేకున్న వాయిస్ కాల్‌తో గర్భిణి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆహార నియమాలు వివరిస్తుంది. ఒక వేళ వాయిస్ కాల్ వచ్చినప్పుడు వినలేక పోతే 14423 కి కాల్ చేస్తే మళ్లీ వినే అవకాశం ఉంటుంది. ప్రతి వారం మాకు ఏఎన్ఎం, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు ఇంటి వద్దకు వచ్చి వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నారు. కిల్కారీ సేవల గురించి వివరిస్తున్నారు.

–శ్రావణి, గర్భిణి, గడివేముల

కిల్కారీపై ప్రతి గర్భిణికి అవగాహన కల్పిస్తున్నాం



గర్భిణులు, పాలిచ్చేల తల్లుల కోసం ప్రవేశ పెట్టిన కిల్కారీ విధానంపై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నాం. గ్రామంలోని గర్భిణీ,బాలింతల ఫోన్ నంబర్లను ఆన్‌లైన్‌లో నమోదు చేయడం ద్వారా వాయిస్‌కాల్స్ వస్తాయి. ప్రతి వారం ఇంటి వద్దకు వెళ్లి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకుని ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నాం.

–భారతి, ఏఎన్ఎం, గడివేముల పీహెచ్‌సీ

సద్వినియోగం చేసుకోవాలి



మాతాశిశు మరణాలను తగ్గించేందుకు ప్రభుత్వం కిల్కారీ సేవలు అందుబాటులోకి తీసువచ్చింది. దీని ద్వారా గర్భిణులు, పిల్లల ఆరోగ్యానికి సంబంధించి సందేశాలు లభిస్తాయి. వాయిస్ కాల్ వినడం ద్వారా గర్భిణులు తమ సందేహాలను నివృత్తి చేసుకోవచ్చు. తల్లీబిడ్డల ఆరోగ్యాన్ని సంరక్షించే ఈ మహత్తర కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ఇప్పటికే అందరికి కిల్కారీపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాం.

–డాక్టర్ మొల్లా జబీన్, పీహెచ్‌సీ గడివేముల

నేడు తహసీల్దార్ కార్యాలయంలో ‘స్పందన’

కర్నూలు (న్యూటౌన్): ప్రజా సమస్యలకు పరిష్కార వేదిక ‘స్పందన’ కార్యక్రమం సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు కర్నూలు రూరల్ తహసీల్దార్ ఆర్ శివరాముడు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు స్పందన కార్యక్రమం ఉంటుందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవానలి సూచించారు. మండల పరిధిలోని అన్ని శాఖల అధికారులు కార్యక్రమానికి హాజరు కావాలని తెలిపారు.

సి.బెళగల్: తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమానికి అధికారులు తప్పనిసరిగా హాజరవ్వాలని తహసీల్దార్ శేషఫణి ఆదివారం ఓ ప్రకటనలో సూచించారు. సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిర్వహించే స్పందన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కోడుమూరు రూరల్ : ప్రజా సమస్యల పరిష్కారంలో భాగంగా కోడుమూరులోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ చంద్రోశేఖర్ ఆదివారం తెలిపారు. స్పందన కార్యక్రమంలో మండలంలోని అన్ని శాఖల అధికారులు పాల్గొంటారని, ప్రజలు ఏవైనా సమస్యలుంటే అర్జీలు సమర్పిస్తే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

గూడూరు: తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమానికి మండల, గ్రామ స్థాయి అధికారులు హాజరు కావాలని తహసీల్దార్ శివశంకర్ నాయక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిర్వహించే కార్యాక్రమానికి అధికారులు గైర్హాజరైతే చర్యలు తప్పవని హెచ్చరించారు.

భక్తిశ్రద్ధలతో అమావాస్య పూజలు



కొమ్ము చెరువులో స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

- కిటకిటలాడిన ఆంజనేయస్వామి క్షేత్రాలు
- మొక్కులు తీర్చుకున్న భక్తులు

ఓర్వకల్లు: మండలంలో వెలసిన ఆంజనేయస్వామి దేవాలయాల వద్ద ఆదివారం అమావాస్య పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అశేష భక్తజనంతో స్వాముల వారి క్షేత్రాలు కిటకిటలాడాయి. స్వాముల వారిని దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ప్రధాన పుణ్య క్షేత్రాలైన కొమ్ముచెరువు, బొడ్డువానిపల్లె ఆంజనేయస్వామి ఆలయాలల్లో ఆలయ నిర్వాహకుల ఆధ్వర్యంలో అర్చకులు ఉదయం స్వాముల వారికి అభిషేకం నిర్వహించి, సిందూర అలంకరణ, ఆకుపూజలతో ప్రత్యేక ఆకర్షణగా అలంకరించారు. మధ్యాహ్నం బొడ్డువానిపల్లెలో పూడిచెర్ల గ్రామ ప్రజల సహకారంతో భక్తులకు అన్నదానం చేశారు. అదేవిధంగా కొమ్ముచెరువులో ఆలయ నిర్వాహకులు రమేషయ్య ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. సాయంత్రం సింధూర అలంకరణ, ఆకుపూజలు నిర్వహించి, మహా మంగళహారతులు సమర్పించారు. కాల్వ గ్రామం వద్ద వెలసిన కోనేటి ఆంజనేయస్వామి వద్ద ఆలయ కమిటీ నిర్వాహకులు ఆరవేటి రమేష్‌శెట్టి ఆధ్వర్యంలో స్వాముల వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు అన్నదానం చేశారు.

హనుమయ్యా... ఆశీర్వదించవయ్యా!

ఓర్వకల్లు: మండలంలోని కొమ్ముచెరువు ఆంజనేయ స్వామి దేవాలయంలో మండల వైఎస్సార్‌సీపీ శ్రేణులు ‘ హనుమయ్యా–ఆశీర్వదించవయ్యా’ అంటూ సామూహికంగా మొక్కులు తీర్చుకున్నారు. ఆదివారం అమవాస్య కావడంతో హుసేనాపురం గ్రామానికి చెందిన నాయకులు జీకె వెంగన్న, సచివాలయ మండల కన్వీనర్ లోటర్ బాషా, కాల్వ గ్రామ సర్పంచ్ కేపీ వెంకటేశ్వర్లు, ఉప సర్పంచు నూర్‌అహ్మద్ ఆధ్వర్యంలో కొమ్ముచెరువు ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. ముందుగా స్వాముల వారికి ఆకుపూజ నిర్వహించి, భక్తులకు అల్పాహారం ఏర్పాటు చేశారు. అనంతరం జై జగన్, జై కాటసాని అనే నినాదాలతో స్వాముల వారికి సామూహికంగా 108 కొబ్బరి కాయలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాష్ట్రంలోని 2024 సార్వత్రిక ఎన్నికల్లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి 175–175 స్థానాలు సాధించి, మరోసారి ముఖ్యమంత్రి కావాలని, అలాగే పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అత్యధిక మెజార్టీతో గెలుపొందాలని మొక్కుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాల్వ ఎంపీటీసీ సభ్యులు నాగిరెడ్డి, కాల్వబుగ్గ ఆలయ ట్రస్టుబోర్డు ఛైర్మన్ గుర్రాల చెన్నారెడ్డి, గుడుంబాయి తండా, సోమయాజులపల్లె తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి వారాహీ నవరాత్రులు

కర్నూలు కల్చరల్: కర్నూలు ఓల్డ్‌సిటీ లలితా పీఠంలో సోమవారం నుంచి 28వ తేదీ వరకు ఆషాడ మాసాన్ని పురస్కరించుకొని వారాహీ నవరాత్రులు (గుప్త నవరాత్రులు) నిర్వహిస్తున్నట్లు లలితా పీఠం పీఠాధిపతి మేడా సుబ్రహ్మణ్య స్వామి తెలిపారు. తొమ్మిది రోజుల పాటు ప్రతి రోజు సాయంత్రం 6.30 నుంచి 8 గంటల వరకు వారాహీ అమ్మవారి షోడశోపచార పూజ, ఊంజల్ సేవ, దర్బార్ సేవ, మణి ద్వీప వర్ణన పారాయణం నిర్వహిస్తామని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

సూర్య నారాయణ స్వామి ఆలయంలో..

నగర శివారులోని సూర్యనారాయణ స్వామి ఆలయ ఆవరణలోని మహా గౌరి అమ్మవారి ఆలయంలో సోమవారం నుంచి ఈనెల 27 వ తేదీ వరకు అమ్మవారి వారాహీ నవరాత్రులు నిర్వహిస్తున్నట్లు ఆలయం మేనేజింగ్ ట్రస్టీ శివరామకృష్ణ తెలిపారు. ప్రతి రోజు ఉదయం 9.30 గంటలకు లలితా సహస్ర నామార్చన, సాయంత్రం 6.30 నుంచి వారాహీ సహస్ర నామార్చన పూజలు జరుగుతాయని తెలిపారు.

ముస్లిం మైనార్టీల అభివృద్ధికి పెద్దపీట

- దర్గా, ఈద్గాల అభివృద్ధికి సహకారం
- కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్

కర్నూలు (న్యూటౌన్): ముస్లిం మౌనార్టీల సంక్షేమానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పెద్దపీట వేసిందని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ తెలిపారు. కర్నూలు మండలం దిన్నెదేవరపాడు గ్రామ పరిధిలోని జగన్నాథగట్టుపై వెలసిన హజరత్ మౌలాలి సాహెబ్ దర్గా ఈద్గా కాంపౌండ్ వాల్ నిర్మాణ పనులను ఆదివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. హజరత్ మౌలాలి సాహెబ్ దర్గాలో ఎమ్మెల్యే గంధం సమర్పించి ప్రత్యేక ఫాతెహాలు నిర్వహించి దర్శించుకున్నారు. అనంతరం రూ.5లక్షలతో చేపట్టిన హజరత్ మౌలాలి సాహెబ్ దర్గా ఈద్గా కాంపౌండ్ వాల్ నిర్మాణానికి ఎమ్మెల్యే ప్రత్యేక ఫాతెహాలు, ప్రార్థనలు చేసి ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ హజరత్ మౌలాలి సాహెబ్ దర్గాలో అభివృద్ధి పనులకు తనవంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు. మౌలాలిసాహెబ్ చల్లని దీవెనలు ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. గార్గేయపురం చెరువు కట్ట వద్ద వెలసిన హజ్రత్ షాహ్ సయ్యద్‌షాహ్ వలీల్లాహ్ రహ్మతుల్లా అలైహ్ దర్గాలో మంచినీటి బోరు వేయించానని చెప్పారు. చాలా మంది ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గం పరిధిలో ఉన్న దర్గాల్లో ప్రత్యేక ఫాతెహాలు సమర్పించి దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో కర్నూలు ఎంపీపీ వెంకటేశ్వరమ్మ, దిన్నెదేవరపాడు ఎంపీటీసీలు మద్దిలేటి, రామ్‌నాథ్‌రెడ్డి, మాజీ సర్పంచ్ భాస్కర్‌రెడ్డి, మాజీ మండల కన్వీనర్ హరినాథ్‌రెడ్డి, మాజీ మండల ఉపాధ్యక్షుడు వాసు, ఉల్చాల గ్రామ సర్పంచ్ విద్యాసాగర్, వైఎస్సార్‌సీపీ గ్రామ నాయకుడు వేణుగోపాల్, హజరత్ మౌలాలి సాహెబ్ దర్గా పీఠాధిపతి మౌలాలి, ఇమామ్‌సాహెబ్ మహబూబ్‌బాషా, కమిటీ సభ్యులు, భక్తులు, దిన్నెదేవరపాడు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



కాంపౌండ్ వాల్ నిర్మాణానికి ప్రార్థన చేస్తున్న కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్



హజరత్ మౌలాలి సాహెబ్ దర్గాలో ప్రత్యేక ఫాతెహాలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే సుధాకర్

ప్రజా సమస్యలపై పోరాటం

కర్నూలు (రూరల్): ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి పోరాటం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్ తెలిపారు. ఆదివారం నగరంలోని కార్మిక, కర్షక భవనంలో సీపీఎం కార్యకర్తల సమావేశం ఎం . షరీఫ్ అధ్యక్షతన జరిగింది. గౌస్ దేశాయ్ మాట్లడుతూ... కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించి పోరాటాలకు సిద్ధం చేయాలన్నారు.

సంఘటితంతో హిందూ ధర్మపరిరక్షణ

కర్నూలు కల్చరల్: హిందువులందరూ సంఘటితంగా ఉంటేనే హిందూ ధర్మం రక్షించప బడుతుందని వీహెచ్‌పీ కేంద్రీయ లీగల్ సెల్ సదస్యులు గొల్లపూడి శ్యాం ప్రసాద్ ముఖర్జీ అన్నారు. ఆదివారం వీహెచ్‌పీ కార్యాలయంలో న్యాయవాదుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి హిందూ సమాజానికి పెను సవాళ్లు ఎదురవుతున్నాయన్నారు. తగిన న్యాయ సలహా, సహకారాలు అందజేయడంలో న్యాయవాదులు కీలక పాత్ర పోషించాలన్నారు. ఇందుకు వీహెచ్‌పీ దక్షిణాంధ్ర ప్రదేశ్ విధి ప్రకోష్ట సంస్థ ఆవిర్భావ అవసరం ఎంతో ఉందన్నారు.

పిల్లల్లో గుండెజబ్బులను గుర్తించాలి

కర్నూలు(హాస్పిటల్): పిల్లల్లో సకాలంలో గుండెజబ్బులను గుర్తించి చికిత్స అందిస్తే వారు కోలుకునే అవకాశం ఉందని ఇండియన్ అకాడమి ఆఫ్ పీడియాట్రిక్స్ (ఐఏపీ) ఎన్ఆర్‌పీ స్టేట్ కో ఆర్డినేటర్ డాక్టర్ వి.రాజేష్ చెప్పారు. ఆదివారం ఐఏపీ, మెడికవర్ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక మెడికవర్ హాస్పిటల్‌లో శిశువుల్లో గుండెజబ్బులపై శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ వి. రాజేష్ మాట్లాడుతూ శిశువు ఊపిరిపీల్చుకోవడం ప్రారంభించి గులాబి రంగులోకి మారినట్లయితే, గుండెజబ్బులు వంద బీపీఎంలోపు ఉంటే అవసరమైన చికిత్స అందించాలన్నారు. ఈ సమయంలో నర్సులు ఏమి చేయాలో అవసరమైన శిక్షణ అందించామన్నారు. కార్యక్రమంలో నియోనేటల్ రిసోసియేషన్ ప్రోగ్రామ్ శిక్షకులు డాక్టర్ దశరథరామయ్య, డాక్టర్ సుధాకర్ నాయక్, మెడికవర్ హాస్పిటల్ క్లస్టర్ హెడ్ మహేశ్వరరెడ్డి, సెంటర్ హెడ్ నీలారెడ్డి, పీడియాట్రిక్, నియోనేటలాజిస్టు డాక్టర్ సింధూర, పీడియాట్రిషన్ డాక్టర్ సంధ్య, డాక్టర్ మురార్జి పాల్గొన్నారు.



కార్యక్రమాన్ని జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న డాక్టర్ రాజేష్, డాక్టర్ దశరథరామయ్య

టౌన్ మోడల్ కాలేజీ విద్యార్థికి అభినందనలు

కర్నూలు సిటీ: ప్రభుత్వ టౌన్ మోడల్ జూనియర్ కాలేజీకి చెందిన విద్యార్థి ఎల్.చరణ్‌కార్తీక్ జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో ఆల్ ఇండియా లెవెల్‌లో 8,550వ ర్యాంకు సాధించారు. కేటగిరి విభాగంలో 75వ ర్యాంకు రావడంపై కాలేజీ ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు. కర్నూలు నగరంలో బీఎస్ఎన్ఎల్‌లో ఏజీఎంగా పని చేస్తున్న సుధాకర్ బాబు, వరలక్ష్మి దంపతుల కుమారుడైన ఎల్.చరణ్‌కార్తీక్ పదవ తరగతి వరకు ప్రైవేటు స్కూల్‌లో చదివారు. ఇంటర్ విద్యను టౌన్ మోడల్ కాలేజీలో అభ్యసించి 1000 మార్కులకు 961 మార్కులు సాధించారు. జేఈఈ మెయిన్స్‌లో 98.84 పర్సెంటైల్ సాధించి ఆల్ ఇండియా లెవెల్‌లో 13,509వ ర్యాంకు, కేటగిరీలో 74వ ర్యాంకు సాధించారు. బీటెక్ పూర్తి అయిన తరువాత సివిల్స్ రాసి ఐఏఎస్ కావాలనే లక్ష్యంగా పెట్టుకున్నట్లు చరణ్‌కార్తీక్ తెలిపారు. జేఈఈలో మంచి ర్యాంకు రావడంతో ఆ విద్యార్థికి ఆదివారం పలువురు అభినందించారు.

యువత దేశ భక్తి కలిగి ఉండాలి

కర్నూలు కల్చరల్: యువత దేశ భక్తి కలిగి శక్తి వంతులుగా ఎదగాలని బజరంగ్ దళ్ రాష్ట్ర కన్వీనర్ ప్రతాప రెడ్డి సూచించారు. ఆ సంస్థ ఆధ్వర్యంలో రెవెన్యూ కాలనీలోని శ్రీ హనుమాన్ వ్యాయామశాలలో ఆదివారం మాసిక వర్గను నిర్వహించారు. శౌర్య ప్రశిక్షణ వర్గ పూర్తి చేసి బజరంగ్ దళ్ కార్యకర్తలు, సాప్తాహిక్ మిలన్, బలోపాసన కేంద్రాల కార్యకర్తలు సమావేశంలో పాల్గొని వివిధ అంశాల్లో శిక్షణ పొందారు. ఈ సందర్భంగా ప్రతాప రెడ్డి మాట్లాడుతూ యువత శారీరక ధృడత్వంతో ఆత్మవిశ్వాసం కలిగి ఉండాలన్నారు. దేశ రక్షణకు, హిందూ ధర్మ పరిరక్షణకు కంకణ బద్ధులు కావాలన్నారు.


కొనసాగుతున్న ఒలింపిక్ క్రీడా సంబరాలు

కర్నూలు (రూరల్): ఒలింపిక్ డే సందర్భంగా నిర్వహిస్తున్న క్రీడాపోటీలు దిగ్విజయంగా కొనసాగుతున్నాయి. నగరంలోని ఔట్‌డోర్ స్టేడియంలో ఆదివారం హాకీ పోటీలను న్యాయవాది జయరాజ్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఒలింపిక్ సంఘం నాయకులు శ్రీనివాసులు, రసూల్, ద్వారకనాథ్, ఆది నారాయణ, బిల్డర్ ఆనంద రెడ్డి పాల్గొన్నారు.

– ఔట్‌డోర్ స్టేడియంలో జరిగిన కరాటే పోటీలను మన్సూర్ అలీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ... కరాటే ఆత్మ రక్షణకు ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ఒలింపిక్ సంఘం నాయకులు శ్రీనివాసులు, సునీల్ కుమార్, అవినాష్, ఆరీఫ్, సతీష్ పాల్గొన్నారు.

– నగరంలోని బాలికల ఉన్నత పాఠశాలలో జరిగిన ఉషూ పోటీల్లో 60 మంది క్రీడాకారులు పాల్గొని ప్రతిభ కనబరిచారని ఉషూ సంఘం కార్యదర్శి శ్రీనివాసులు తెలిపారు.

– స్విమ్మింగ్ పోటీలను జిల్లా ఒలింపిక్ సంఘం కార్యదర్శి శ్రీనివాసులు లాంఛనంగా ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో స్విమ్మింగ్ అసోసియేషన్ నాయకులు నరసింహులు, శ్రీనివాసులు, అవినాష్, విశ్రాంత శిక్షకులు నటరాజ్ పాల్గొన్నారు.



హాకీ పోటీలను ప్రారంభిస్తున్న జయరాజ్

టెంకాయల వేలం పాట జరిగేనా!

గూడూరు రూరల్: మండల పరిధిలోని కె.నాగలాపురంలోని గ్రామ దేవత శ్రీ సుంకులాపరమేశ్వరీదేవి దేవాలయం ప్రసిద్ధి. అమ్మవారికి భక్తులు నిత్యం దర్శించుకుంటారు. ప్రత్యేకించి ప్రతి మంగళ, శుక్రవారాల్లో వేల సంఖ్యలో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి మొక్కులు తీర్చుకుంటుంటారు. అయితే గత ఐదు నెలలుగా గ్రామంలో నెలకొన్న ఆధిపత్య పోరు కారణంగా టెంకాయల వేలం పాట నిలిచిపోయింది. దీంతో దేవాలయానికి టెంకాయల ద్వారా రావాల్సిన లక్షలాది రూపాయాల ఆదాయానికి గండి పడింది. అమ్మవారి గుడి దేవాదాయశాఖ ఆధీనంలోకి రాకముందు ముప్పైఏళ్ల కిందట గ్రామానికి చెందిన కొందరు పెద్దలు గ్రామ కమిటీని ఏర్పాటు చేసుకుని వేలం పాటను నిర్వహించేవారు. అధిక మొత్తంలో పాడిన పాటాదారునికి గుడి ముందు టెంకాయలను అమ్ముకునే హక్కు ఉంటుంది. పాటాదారుడు తప్ప ఇతరులు టెంకాయలను అమ్మితే రూ. 5,000 వరకు జరిమానా విధించేవారు. టెంకాయల ద్వారా వచ్చే ఆదాయాన్ని గుడి అభివృద్ధి, భక్తులకు మౌలిక సదుపాయాల కల్పన కొరకు ఖర్చు చేసేవారు. కాలక్రమేనా అమ్మవారి దేవాలయానికి ఆదాయం పెరిగిపోతుండటంతో 2006–07 సంవత్సరంలో దేవదాయశాఖ పరిధిలోకి గుడిని ప్రభుత్వం విలీనం చేసింది. ఆ నాటి నుంచి దేవదాయశాఖ, గ్రామ పెద్దలు కలిసి టెంకాయల వేలం పాటను నిర్వహిస్తున్నారు. ఆదాయంలో 50 శాతం దేవాలయానికి, 50 శాతం సొమ్మును గ్రామ కమిటీకి ఇవ్వాలని తీర్మానించారు. ఈ పద్ధతి మూడేళ్లుగా కొనసాగుతుంది. ఏడాదికి టెంకాయల వేలం ద్వారా రూ. 24 లక్షల వరకు ఆదాయం వస్తుండగా దేవాలయానికి రూ. 12 లక్షలు, గ్రామ కమిటీకి రూ. 12 లక్షలను పాటాదారుడు చెల్లిస్తున్నారు. ప్రతి ఏడాది టెంకాయల ద్వారా లక్షలాది రూపాయాల సొమ్ము వస్తున్నా గ్రామంలో అభివృద్ధి పనులు జరుగడం లేదంటూ కొందరు పెద్దలు మరో కమిటీని ఏర్పాటు చేసుకున్నారు. అయితే పాత, కొత్త గ్రామ కమిటీల మధ్య వివాదం నెలకొనడంతో ఐదు నెలలుగా టెంకాయల వేటం పాటను అధికారులు నిర్వహించలేదు. దేవదాయశాఖ జిల్లా అధికారులు స్పందించి టెంకాయల వేలాన్ని నిర్వహించాలని భక్తులు కోరుతున్నారు.



శ్రీ సుంకులాపరమేశ్వరీ దేవి దేవాలయం

టెంకాయల వేలంపై నిర్ణయం తీసుకుంటాం

గత ఏడాది ఫిబ్రవరిలో టెంకాయల వేలం పాటను నిర్వహించడం జరిగింది. అనివార్య కారణాల వల్ల టెంకాయల వేలం పాట ఆలస్యమైంది. జిల్లా అధికారుల నుంచి ఆదేశాలు వస్తే గ్రామ పెద్దలు, ప్రజల సహకారంతో టెంకాయల వేలం పాటను నిర్వహిస్తాం.

– రాధాకృష్ణ కార్యనిర్వహణాధికారి కె.నాగలాపురం